www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 జూన్ 2025

5

తిరుపతి



తిరుమల జి.ఎన్.సి టోల్ గేట్ వద్ద కారులో మంటలు



ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలోని జీఎన్సీ టోల్ గెట్ వద్ద కారులో మంటలు చెలరేగాయి. ఘట్ రోడ్డులో ప్రయాణం అనంతరం తిరుమలకు చేరుకోగానే దట్టమైన పొగతో మంటలు వ్యాపించాయి. క్షణాల వ్యవధిలో కారు మొత్తం మంటలు వ్యాపించాయి. భక్తులు కారు ఆపి భయటకు పరుగులు పెట్టారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. ఈ కారు లో మొత్తం 6మంది కర్ణాటక భక్తులు ప్రయాణిస్తూ తృటిలో తప్పించుకున్నారు.

మామిడి రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలి
: ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, రామచంద్రపురం : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం తిరుపతి జిల్లాలోని రామచంద్రాపురం మండలంలోని పివిపురం పంచాయతీ, రామిరెడ్డి పురం గ్రామంలో మామిడి చెట్లు నరికేసిన రైతులను కలిసి క్షేత్రస్థాయిలో మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పంటకు ప్రభుత్వం ప్రకటించిన కేజీకి రూ.12లు అందేటట్లు ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేశారు. మామిడి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకటనలకే పరిమితమవుతున్నదని, మామిడి గుజ్జు ఫ్యాక్టరీల యజమానులు, వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి రైతుల నుంచి కేజీ రూ.2లకే కొనుగోలు చేసి మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కేజీ రూ.8లకు కొనుగోలు చేయని గుజ్జు పరిశ్రమలు, వ్యాపారస్తులపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మామిడి పంటకు భవిష్యత్తులో మద్దతు ధర కూడా కరువు అవుతుందని మామిడి చెట్లు నరికేసి ప్రత్యామ్నాయ పంటలైన వరి, వేరుశనగ పంటలు పండించడానికి మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ రాష్ట్రంలో పొగాకు, మిర్చికి బోర్డులు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తున్నప్పుడు మామిడి పంటకు ఎందుకు మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయరని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మామిడి రైతులపై మమకారం ఉంటే వెంటనే మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి రైతులకు ప్రభుత్వమే కేజీకి రూ.12లు మద్దతు ధర చెల్లించి మామిడి కాయలను కొనుగోలు చేయాలని సూచించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మామిడి రైతులను ఆదుకునేందుకు గుజ్జు ఫ్యాక్టరీల యజమానులపై కఠిన చర్యలు తీసుకుని, మామిడి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.



మామిడి చెట్లను తొలగించి, వరి, వేరుశనగ పంటలను పరిశీలిస్తున్న దృశ్యం

9న సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం కండి

- ఆశా వర్కర్ల జిల్లా శిక్షణా తరగతుల్లో కందారపు మురళి పిలుపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వాలు సంయుక్తంగా కార్మికుల పట్ల అనుసరిస్తున్న దుర్మార్గపు విధానాలను నిరసిస్తూ జూలై 9 వ తేదీన నిర్వహింప తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు భాగస్వాములు కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పిలుపునిచ్చారు. ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ శిక్షణా తరగతులలో కందారపు మురళి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం వర్కర్లు స్కీం వర్కర్లుగా దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలకు సేవలు అందిస్తున్నా వారి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరులు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించమని అనేక ఏళ్లుగా సిఐటియు పోరాడుతున్న పట్టించుకోవడంలేదని మురళి గుర్తు చేశారు. ఆశా వర్కర్లు తిరుపతి జిల్లాలో పోరాడుతున్న తీరును ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు ఆర్.లక్ష్మి క్లాసులను ప్రారంభించి, ప్రాధాన్యతను వివరించారు. హిందుత్వ ప్రమాదం ప్రభుత్వ విధానాలపై సిఐటియు నేత మాధవ్, జాతీయోద్యమ నాయకులు వారి ప్రాధాన్యత గురించి జయచంద్ర, దోపిడీ అంశంపై కేఎన్ఎన్ ప్రసాదరావులు బోధించారు. కార్యక్రమానికి ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం కవిత అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, ఉష, జానకి, అను తదితరులు హాజరయ్యారు.



ఆశ వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నేతలు

భవన నిర్మాణ కార్మికులకు రక్షణేదీ..?



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: భవన నిర్మాణ కార్మికుల కోసం 1214 మెమోను రద్దు చేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని రాష్ట్ర భవన నిర్మాణం కార్మిక సంఘం అధ్యక్షులు నారపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఎస్.ఆల్లయ్య అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ నిర్వహించారు. ఈ మహాసభలో పాల్గొన్న రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు నారపల్లి రమణ రావు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో నిర్మాణాలు విస్తృతంగా పెరిగినట్లుగానే కార్మికులకు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. నిర్మాణంలో కార్మికుల రక్షణను అమలు చేయడం లేదని విమర్శించారు. మున్సిపల్ , కార్పొరేషన్ అధికారుల తనిఖీలు లేకపోవడంతో, నాసిరకం నిర్మాణాలలో భవన నిర్మాణ కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి రక్షణ కల్పించాల్సిన కార్మిక శాఖ ఉత్సవ విగ్రహంలా తయారయిందన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత వారిలో కదలిక వస్తోందని, బాధితుల కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. 10 లక్షల పైబడిన నిర్మాణంలో ఒక పర్సెంట్ బిల్డర్ నుండి వసూలు చేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో జమ చేస్తారని తెలిపారు. ఈ డబ్బును భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసమే ఉపయోగించాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగి అంగవైకల్యం సంభవిస్తే, పెళ్లికి ఆర్థికంగా సహాయం, పిల్లల చదువులకు స్కాలర్షిప్‌లు వంటి సదుపాయాలున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుతం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను తమ కార్యక్రమాలకు మళ్ళించాయని మండి పడ్డారు. అంతటితో ఆగక 1214 మెమో ఇచ్చి పరిహారాలు చెల్లించకుండా నిలిపివేశాయన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి సంవత్సరం అవుతున్నా పట్టించుకోలేదని విమర్శించారు. జూలై 9న జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం 1031.25 కోట్లు వాడుకున్నాయని, వైసీపీ ప్రభుత్వం 830 కోట్ల రూపాయలు వాడుకున్నాయని, సంక్షేమ బోర్డు నిధులు తిరిగి చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయకుండా కార్మికులకు ద్రోహం చేస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు కోసం గతంలో ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, ఎమ్మార్వోలకు, ఆర్డిఓలకు వినతి పత్రాలు అందించామన్నారు. మంత్రులు ఇళ్ల కూడా ముట్టడి చేశామని తెలిపారు. కానీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, మెమో1214 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కోరికల సాధనకై దేశవ్యాప్త సమ్మె, అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

◆ శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. దర్శించుకున్న వారిలో టాటా చైర్మన్ గ్రూప్స్ నటరాజన్ చంద్రశేఖరన్, తెలంగాణ ఎమ్మెల్యే నిర్మల, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి సుధా, ఆర్టీసీ ఎండి సజ్జనార్, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వున్నారు. వీరికి ఆలయంలో టిటిడి అదనపు ఈఓ ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి రంగనాయక మండపంలో స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

◆ శ్రీవారి భక్తుల సదుపాయలపై సర్వే

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి భక్తులకు అందిస్తున్న వివిధ సేవలను ఎప్పటికప్పుడు మరింత మెరుగుపరచడంలో భాగంగా గత కొంత కాలంగా టిటిడి భక్తుల నుంచి విలువైన అభిప్రాయాల్ని సేకరిస్తోంది. ఐవీఆర్ఎస్, వాట్సాప్ ద్వారా ఈ-సర్వే, శ్రీవారి సేవకుల ద్వారా మాన్యువల్ సర్వేలను ప్రారంభించి భక్తుల నుంచి అభిప్రాయం తీసుకుంటోంది. ఈ ఎలక్ట్రానిక్ సర్వే ద్వారా భక్తులు తిరుమల యాత్ర పూర్తి అనుభవం, అన్న ప్రసాదం, కల్యాణ కట్ట, శ్రీవారి ఆలయం, వసతి, క్యూ లైన్ల నిర్వహణ, లగేజ్ కౌంటర్లపై మొత్తం 16 ప్రశ్నలకు తమ అభిప్రాయాలు వ్యక్తపరచవచ్చు. తిరుమల, తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను మొబైల్‌తో స్కాన్ చేస్తే టిటిడి అభిప్రాయ సేకరణ పేజీ ఓపెన్ అవుతుంది. అనంతరం సర్వే ప్రారంభం అవుతుంది.

◆ ఎస్వీ విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల: చెన్నైకు చెందిన టీవీఎస్ క్యాపిటల్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళంగా అందించింది. ఈ విరాళం చెక్కును సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ శ్రీనివాసన్ శనివారం సాయంత్రం తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో సీ.హెచ్.వెంకయ్య చౌదరికి ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

మహా న్యూస్ కార్యాలయంపై దాడి హేయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తెలంగాణలో మహా న్యూస్ కార్యాలయం, ప్రతినిధులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, పుత్తూరు పట్టణంలోని ఆదివారం అంబేద్కర్ సర్కిల్ వద్ద స్థానిక జర్నలిస్టులు నిరసన తెలిపారు. నగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ పొన్ను స్వామికి వినతి అందజేశారు.

శ్రీవారి భక్తులకు ప్రమాద బీమా

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలకు వచ్చే భక్తులందరికీ భవిష్యత్తులో బీమా సదుపాయం కల్పించాలని టిటిడి ఉన్నతాధికారి పరిశీలిస్తున్నట్లు సమాచారం. శ్రీవారి దర్శనార్థం రోజూ సుమారు 70వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వస్తుంటారు. 2 ఘాట్‌రోడ్లు, అలిపిరి, శ్రీవారి మెట్టుమార్గం, క్యూలైన్లు తదితర ప్రదేశాల్లో అప్పుడప్పుడు ప్రమాదాలకు గురికావడం, ఆకస్మికంగా అనారోగ్యం బారిన పడడం, నడక మార్గంలో అడవి జంతువుల దాడి లాంటి ఘటనల నేపథ్యంలో భక్తులకు బీమా కల్పించాలని యోచిస్తున్నారు. ప్రమాదాలు, ఆకస్మిక గుండెపోటు, జంతువుల దాడిలో మృతిచెందిన వారికి బీమాతో చేయూతనందించాలని చూస్తున్నారు. ప్రస్తుతానికి తిరుమలలో ప్రమాదం బారిన పడి మృతిచెందిన వారికి టీటీడీ రూ.3లక్షల వరకు చెల్లిస్తోంది. ఇప్పుడు అలిపిరి నుంచి తిరుమలకు, తిరుమల నుంచి అలిపిరి వరకు భక్తులు చేరుకునేవరకు వారికి బీమాను కల్పించాలని చూస్తున్నారు. భారీగా వచ్చే భక్తులకు బీమా కల్పించే సంస్థలు, అవి వసూలు చేసే ప్రీమియం, దాతల సహకారం తదితర అంశాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

ఆక్రమణలను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి, తిరుమల నగర్ గ్రామపంచాయతీ చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 195లో జరుగుతున్న భూ ఆక్రమణలను ఆదివారం తిరుపతి అర్బన్ తహశీల్దార్ సురేష్ బాబు ఆదేశాల మేరకు స్థానిక వీఆర్వో ప్రసాద్, వీఆర్వో సతీష్, వీఆర్ఏ నందగోపాల్ అడ్డుకున్నారు. భూమిని ఆక్రమించడానికి పునాదులు వేయడంతో వాటిని తొలగించారు. ఎవరైతే ఇళ్ళ నిర్మాణానికి పూనుకున్నారో వారి వద్ద ఉన్న రికార్డులను తిరుపతి అర్బన్ మండల తహశీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి, రికార్డులు సరిచూసుకోవాలని, ఈ తరహా భూ ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అర్బన్ మండల డిటి సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.



పునాది రాళ్ళను తొలగిస్తున్న రెవిన్యూ సిబ్బంది

అంగన్వాడీల కష్టాలు

ఇంతింత కాదయా..!

- ఫేస్ యాప్‌లతో నిత్యం నరకం
- లబ్ధిదారుల చీవాట్లు, ఛీత్కారాలు
- ప్రభుత్వం పథకాలకూ దూరమే
- పనిచేయని సర్వర్లు, ట్యాబ్‌లు
- అంగన్వాడీ నిర్వహణే కాక అదనపు భారం
- అత్తెసరు జీతాలతో అరకొర జీవితాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : గ్రామీణులకు ఆరోగ్యవంతమైన జీవితాలను అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న అంగన్వా డీల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయి. జీతం జానెడు..పని బారెడు.. కష్టాలు బోలెడు అన్న చందాన మారింది వారి పరిస్థితి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్వాడీలను ఆదుకోవడం బదులు.. యాప్‌ల పేరిట ఓ ఆటాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే గర్భిణీలు, బాలింతలు, చిన్నారు లకు పోషకాహారం అందించే అంగన్వాడీలపై ఫేస్ యాప్ రూపంలో మరో పని భారం పడింది. తాము అధికారంలోకి వస్తే పేస్ యాప్‌ను రద్దుచేసి టీహెచ్ఆర్(టేక్ హోమ్ రేషన్) ను ఒకే గొడుగు కిందకి తెస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అయితే గత ప్రభుత్వానికి మించి కూటమి ప్రభుత్వం అంగన్వాడీలపై పని భారం మోపుతోందని వాపోతున్నారు. పేస్ యాప్ ద్వారా లబ్ధిదారులు నమోదు విషయంలో కనీసం ఐసీడీఎస్ సిబ్బందికి కూడా సరైన శిక్షణ లేకపోవటం, ట్యాబ్‌లు, సర్వర్లు, నెట్ పని తీరు అంతంత మాత్రమే కావడంతో అంతా గందరగోళంగా మారుతుండటం గమనార్హం.



ఫేస్ యాప్‌తో చీవాట్లు, ఛీత్కారాలు.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు బాలలకు ప్రతీ నెలా పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో కేంద్రం వద్ద వండి ఇచ్చేవారు. ఎక్కువ మందికి టీహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్) కావాలంటూ అభ్యర్థనలు రావటంతో పాలు, గుడ్లు, నూనె, పప్పు, బియ్యం వంటివి లబ్ధిదారులకు ప్రతీనెలా రెండు దఫాలుగా ఇస్తున్నారు. టీహెచ్ఎర్ పంపిణీలో అవకతవకలు జరగకుండా ప్రభుత్వం ఎస్ఆర్ఎస్(ముఖచిత్ర యాప్)ను ప్రవేశపెట్టింది. లబ్ధిదారులు వచ్చిన సమయంలో వారి ముఖచిత్రం ద్వారా గుర్తించి, యాప్‌లో నమోదు చేసి టీహెచ్ఎర్ అందించాలి. మరోసారి పోషణ ట్రాకర్ యాప్లో కూడా నమోదు చేయాలి. ఈ యాప్లో కూడా లబ్ధిదారుల ముఖచిత్రాన్ని రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తోంది. ఒకే వ్యక్తి వివరాలను రెండు యాపుల్లో నమోదు చేయటం, టీహెచ్ఐర్ పంపిణీ సమయంలో ఒకే వ్యక్తికి రెండుసార్లు ఫేస్ యాప్ గుర్తించటం అనేది ఇబ్బందికరంగా మారింది. ఇందుకు ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు అనుకూలంగా లేవని తెలుస్తోంది. ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్న కేంద్రాల్లో వివరాలను యాప్లో నమోదు చేసి ఇవ్వటానికి ఒక్కొక్కరికి గంటకు పైగా సమయం పడుతుందని అంగన్వాడీలు వాపోతున్నారు. ఈ క్రమంలో వారి నుంచి చివాట్లు కూడా తింటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం పథకాలకూ దూరమే.. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సుమారు 5 వేల మందికి పైగా అంగన్వాడీలు పనిచేస్తున్నారు. వీరిలో అంగన్వాడి కార్యకర్తకు రూ. 11500, మినీ కార్యకర్తకు రూ. 7500, ఆయాకు రూ. 7500 ప్రభుత్వం వేతనంగా చెల్లిస్తోంది. అంగన్వాడీల నిర్వహణే కాకుండా ప్రభుత్వ కార్యక్రమాలన్నిటిలో భాగస్వామ్యం వహిస్తున్న అంగన్వాడీలకు ఇది చాలీచాలని జీతమే. అయితే ప్రభుత్వాలు మాత్రం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ, వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు, సంక్షేమ ఫలాలు అందుకుండా చేస్తున్నాయి. నిత్యావసర ధరలకనుగుణంగా కనీస వేతనం రూ. 20 వేలు ఇవ్వాలని అంగన్వాడీలు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే తమను ప్రభుత్వ ఉద్యోగుల జాబితా నుంచి తొలగించి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీ కార్యకర్తను, మినీ కార్యకర్తను ఒకే రకంగా పరిగణించి రూ. 20 వేలు వేతనం ఇస్తామన్న లోకేష్ బాబు హామీ ఏమైందని వారంటున్నారు. జూలై 9న జరిగే కార్మిక సమ్మెలో కూటమి కొమ్ములు వంచుతామని హెచ్చరిస్తున్నారు.

సంక్షేమం.. సురక్షితం.. రెండు కళ్లు..!

- త్యాగం చేసుంటే ఎంఎల్ఎ అయ్యేవాడినేమో..!
- 'ప్రజాశక్తి'తో ప్రజారవాణా అధికారి జగదీష్

ముఖా ముఖి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: 'ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం, కార్మికులకు మెరుగైన సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా' అని జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ చెప్పారు. జిల్లాలోని వివిధ డిపోల్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకుంటూ, ప్రయాణికులకు మెరుగైన, అద్భుతమైన సేవలను అందించడమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందన్నారు. సంస్థలో పనిచేసే కార్మికులకు తన పరిధిలో ఉన్నంత వరకూ మెరుగైన సంక్షేమం కోసం పాటుపడతానన్నారు. రెండు రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్న ఆయన 'ప్రజాశక్తి'తో ముఖాముఖి నిర్వహించారు.

ప్రజాశక్తి: మీ బాల్యం గురించి చెప్పండి

జగదీష్ : మాది చిత్తూరు జిల్లా పలమనేరు. మా అమ్మ ఆర్‌వి జీవరత్నమ్మ టీచర్. మా నాన్న మునస్వామి రిటైర్డ్ ఖజానా అధికారి. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో ఆ రోజుల్లోనే మమ్మల్ని బాగా చదివించారు. నేను ఇంటర్ వరకూ పలమనేరులోనే చదివాను. బిటెక్ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో చేశాను. ఎంటెక్ ఐఐటి చెన్నయ్‌లో చదివాను. ఇద్దరు అక్కలు. ఒక చెల్లెలు. చెల్లెలు సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్నారు.

ప్రజాశక్తి : కుటుంబ నేపథ్యం ఏమిటి?

జగదీష్ : నా భార్య హరిత ఎంఎస్‌సి చేశారు. గ్రూప్ 2 రాశారు. ప్రయత్నం చేశాం. ప్రస్తుతం గృహిణిగా ఉన్నారు. ఇద్దరు కుమారులు. అన్వేష్ బిటెక్ పూర్తయి అమెరికాలో ఉన్నాడు. స్నేహన్ చిన్నబ్బాయి బిటెక్ చదువుతున్నాడు.

ప్రజాశక్తి : ఏ ఉద్యోగం చేయాలని అనుకున్నారు?

జగదీష్ : నేను చదివిన చదువుకు ఏ ఉద్యోగం వచ్చినా పర్వాలేదని అనుకున్నా. అయితే ప్రజారవాణా సంస్థలో ఓ అధికారిగా నాకు పోస్టింగ్ వచ్చింది. అదే ఆర్టీసీలో ఉన్నపుడు డిపో మేనేజర్‌గా పోస్టింగ్ వచ్చింది. మొట్టమొదట పీలేరులో డిపో మేనేజర్‌గా ఉన్నాను. ఆ తరువాత అలిపిరి, తిరుపతి వర్కుషాపు స్టోరులో వర్కు మేనేజర్‌గా, డిప్యూటీ సిఎంఇ తిరుపతి, డిప్యూటీ సిటిఎం చిత్తూరుల్లో పనిచేశా.

ప్రజాశక్తి : ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనంపై మీ కామెంట్..

జగదీష్ : నేను డిపో మేనేజర్‌గా చేస్తున్నప్పటి నుంచి ప్రభుత్వంలో విలీనం అయ్యేవరకూ ఆర్టీసీ కార్పొరేషన్ అని సపరేట్‌గా చూసేవారు. అప్పట్లో బాధ అనిపించేది. ప్రభుత్వంలో ఉద్యోగం కాదని అనిపించేది. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల చాలా సంతోషంగా ఉంది. ఇపుడు నేను ప్రభుత్వ రవాణా శాఖ అధికారిగా గుర్తింపు పొందడం ఆనందంగా ఉంది. చిత్తూరులో ఎనిమిది నెలలు పనిచేశా. ఆ తరువాత పర్మినెంట్‌గా తిరుపతికి రెండు రోజుల క్రితం వచ్చి బాధ్యతలు స్వీకరించాను.

ప్రజాశక్తి : పూతలపట్టు ఎంఎల్ఎ అవకాశాన్ని ఎందుకు వదులుకున్నారు?

జగదీష్ : నిజమే. ఆ రోజుల్లో అటు కాంగ్రెస్, ఇటు టిడిపి రెండు పార్టీలూ పూతలపట్టు టికెట్ ఇస్తాని చెప్పారు. 2004లో డబ్బు ఎక్కువ ఖర్చు పెట్టే పరిస్థితి కూడా లేదు. అయినా సాహసం చేయలేకపోయాను. ఒకవేళ టికెట్ తీసుకుని ఉంటే ఎంఎల్ఎ అయి ఉండేవాడినేమో.

ప్రజాశక్తి : మళ్లీ అవకాశం ఇస్తే రాజకీయాల్లోకి వస్తారా?

జగదీష్ : ఆ ఆలోచనే లేదు. ప్రస్తుత రాజకీయాల్లో లౌక్యం ఉండాలి. అదినాకు లేదు. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటమే నేను చిన్నప్పటి నుంచి నేర్చుకున్న పాఠం. ఇపుడు రాజకీయాల్లోకి రావాలంటే కోట్లల్లో ఖర్చు చేయాలి. అంత స్థోమత నాకు లేదు.

ప్రజాశక్తి : కార్మికుల సంక్షేమంపై మీరు ఎలా స్పందిస్తారు?

జగదీష్ : వాస్తవంగా నేను డిపో మేనేజర్‌గా ఉన్నపుడు అధికారిగా ఫీలవుతున్నా, మనస్సులో మాత్రం కార్మికుడిగానే భావించేవాడిని. కాబట్టి కార్మికుల కష్టాలు నాకు తెలుసు. వారి శ్రేయస్సుకు పెద్దపీట వేస్తూ వచ్చాను. ఆర్టీసీ కార్మికుడు అంటే క్రమశిక్షణకు మారుపేరు. క్రమశిక్షణ ఉల్లంఘించకుండా ఉంటే కార్మికుడు ఎంత కష్టాల్లో ఉన్నా అభివృద్ధికి కృషి చేస్తా. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా.

ప్రజాశక్తి : ప్రయాణికులకు అందించే సేవపై మీ కామెంట్

జగదీష్ : ప్రయాణికులే మా దేవుళ్లు. మా సంస్థను ఆదరిస్తుండడంతో ఇంత స్థాయికి ఎదిగాం. బస్టాండులు, డిపోలో ఈ స్థాయికి ఎదిగాయి. వారి సురక్షిత ప్రయాణం, వారి సేవే మాకు ప్రథమ ప్రాధాన్యత.

ప్రజాశక్తి : తిరుపతి ఆర్టీసీ లాభాల్లో ఉందా?

జగదీష్ : తిరుపతి జిల్లా ప్రజా రవాణా సంస్థ నష్టాలు, లాభాలనేది కాదు. దేవుడి సన్నిధిలో ఉన్నందున ప్రాధాన్యత ఉంది. అన్ని ప్రాంతాల్లో విదేశీయులు ఆర్టీసీ బస్సులు ఎక్కుతారో లేదో గానీ, మా ప్రాంతంలో నడిపే ఆర్టీసీలో విదేశీ, స్వదేశీయులు ప్రయాణం చేస్తారు. టిటిడి అదనపు ఈవో వెంకయ్యచౌదరి భక్తుల సేవకు ఉచితంగా ప్రయాణం చేయాలని విన్నవించారు. తిరుమల, తిరుపతి, అలిపిరి, మంగళం డిపోలు లాభాల్లో నడుస్తున్నాయంటే భక్తులే. వారికి సేవ చేయడం మా భాగ్యం. తిరుమలలో ఉచితంగానే ప్రయాణికులకు సౌకర్యం కల్పిస్తున్నాం.

చిక్‌మంగళూరు - తిరుపతి వీక్లీ రైలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కర్ణాటక రాష్ట్రం నుంచి వివిధ ప్రాంతాల వారు శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి వచ్చే భక్తులకు రైల్వే మంత్రిత్వ శాఖ తీపి కబురు వినిపించింది. తిరుపతికి ఓ కొత్త వీక్లీ ఎక్స్ ప్రెస్‌ను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన టైమ్ టేబుల్ కూడా విడుదల అయింది. జులై 3వ తేదీన ఈ రైలు పట్టాలు ఎక్కనుంది. ప్రతి గురువారం రాత్రి తిరుపతి నుంచి 9 గంటలకు బయలుదేరే (నంబర్ 17423 వీక్లీ ఎక్స్ ప్రెస్..) మరుసటి రోజు ఉదయం 10:30 గంటలకు చిక్ మగళూరుకు చేరుకుంటుంది. ప్రతి శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు చిక్ మగళూరు నుంచి బయలుదేరే నంబర్ (17424 వీక్లీ ఎక్స్ ప్రెస్..) మరుసటి రోజు ఉదయం 7:40 నిమిషాలకు తిరుపతికి చేరుకుంటుంది. చిత్తూరు, కాట్పాడి, కుప్పం, బంగారుపేట, వైట్ ఫీల్డ్, కృష్ణరాజపురం, సర్ఎం విశ్వేశ్వరయ్య బెంగళూరు, చిక్క బాణవార, తుమకూరు, తిపటూరు, అరసికెరె, దేవనూరు, బిరూరు, కడూరు, బిసిలేహళ్లి, సకరాయపట్టణ మీదుగా ఈ ఎక్స్ ప్రెస్ రాకపోకలు సాగిస్తుంది. మలేనాడు, తుమకూరు, బెంగళూరు నుంచి శ్రీవేంకటేశ్వర్ స్వామివారి దర్శనం కోసం తిరుపతికి వెళ్లే భక్తుల కోసం చిక్ మగళూరు నుంచి వీక్లీ ఎక్స్ ప్రెస్‌ను నడిపించాలనే డిమాండ్ ఉండడంతో రైల్వే శాఖ వారపు రైలు నడపనున్నారు.

11వ రోజు కొనసాగిన దీక్షలు



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: రామారావుని బదిలీ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం నాటికి 11వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ 11 రోజుల నుండి మున్సిపల్ కార్మికులు ఆందోళన చేస్తూ ఉంటే మున్సిపల్ చైర్ పర్సన్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించాలని రామారావుని పారిశుధ్యం నుండి పక్కన పెట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, శుభ రత్నమ్మ, తదితరులు పాల్గొనడం జరిగింది.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, మామండూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఏ. మునిరామిరెడ్డికి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పదవి విరమణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు కష్టపడి పని చేసి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలన్నారు.12వ పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేయాలని బకాయిలు ఉన్న డిఏ లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి జిల్లా ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొని ముని రామిరెడ్డి ని ఘనంగా సన్మానించారు.

భవిష్యత్తు సోషలిజానిదే

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్ఎఫ్ఐ 18 వ అఖిల భారత మహాసభలకు ఎస్వీ యూనివర్సిటీ నుంచి జూన్ 22 న కేరళ రాష్ట్రానికి బైక్ పై యాత్రగా ఎస్ఎఫ్ఐ నాయకులు వెళ్లారు. తిరుపతి నుంచి వెళ్లిన రవి, అక్బర్, వినోద్, నంద్యాల నుంచి వెళ్లిన నాయక్ ఈ ప్రయాణం గొప్ప అనుభూతిచ్చిందన్నారు. " సోషలిజం మీ భవిష్యత్తు " అంటూ పతాకాన్ని వెంట తీసుకొని 730 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ ప్రచారం చేసుకుంటూ పోతున్న ఈ కామ్రేడ్స్ చేసిన ప్రయత్నంతో సోషలిజమే భవిష్యత్తు అని అర్థం అవుతుందని వారు అభిప్రాయపడ్డారు.

నాణ్యమైన విద్యే ఆదిశంకర లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వంకీ పెంచలయ్య తదితరులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నాణ్యమైన విద్యను అందించడమే ఆదిశంకర లక్ష్యమని కళాశాల చైర్మన్ వంకీ పెంచలయ్య పేర్కొన్నారు. ఆదివారం గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల డీమ్డ్ యూనివర్సిటీగా మారిన నేపథ్యంలో చదువులో మెరిట్ సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 75% పైన మార్కులు వచ్చిన వారికి ఉచితంగా సీట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. పరిశ్రమలకు అనుగుణంగా ప్రత్యేకమైన కోర్సులను అందిస్తున్నామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మైనింగ్ కబంధ హస్తాల్లోని బంజరు మిగులు భూములను నిరుపేదలు సాగు చేసుకోవాలకుంటే, ఈ విషయానికి సంబంధం లేని వెంకట క్రిష్ణ మైనింగ్ వారికి సమర్థింపుగా పోలీసులు 50 మంది దళితులు పైఅక్రమ కేసు బనాయించడం దారుణమని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఏఐకెఎంఎస్ అధ్యక్షులు డిపి పోలయ్య ఆరోపించారు. ఆదివారం గూడూరు, రిటైర్డ్ అధికారుల భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగే ఏఐకెఎంఎస్ జిల్లా సదస్సు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెత్తం దారులు ఆక్రమించుకున్న భూముల్లో ఎటువంటి నిషేధ బోర్డు లు పెట్టకుండా, దళితులు పేదలు సాగు చేసుకుంటున్న భూముల్లో సైదాపురం మండలం తహశీల్దారు నిషేధ బోర్డులు పెట్టారని విమర్శించారు. రెవెన్యూ యంత్రాంగా కమ్మక్కైందని మండిపడ్డారు. పేదలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సదస్సుకు అన్ని వర్గాల ప్రజలు తమ ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్, పి ఓ డబ్ల్యూ మహిళా నాయకురాలు మమత తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం గూడూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

గంగమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో బజారు వీధిలో వెలసిన పిడికిలి గంగమ్మ జాతర నిర్వహణకు సంబంధించి ప్రత్యేక కమిటీ సమావేశం ఆదివారంనిర్వహించారు. ఈ సమావేశంలో జాతర కార్యక్రమాల తేదీలపై నిర్ణయం తీసుకున్నారు. 31-08-2025 (ఆదివారం): గంగ జాతర చాటింపు, 2-9-2025 (మంగళవారం) రాత్రి: చాటుబాండి ఊరేగింపు, 3-09-2025 (బుధవారం): గంగ జాతర ప్రధాన వేడుక జరపాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గాలి జీవరత్నం నాయుడు, విక్కీ రాయల్, మాడ శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ గోపి ఆచారి, జి బాబు, మధు బాబు, మురళి ఆచారి, గంగ జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మత్తుకోసం.. గమ్మత్తయిన ఏర్పాట్లు

- షాపుల వద్దే అన్ని సౌకర్యాలతో అనుమతి లేని రూములు
- లైసెన్స్‌లున్నది బ్రాందీ షాపులకా? బార్లకా?
- ప్రభుత్వాదాయానికి గండి
- అధికారుల నిర్లక్ష్యం



కలర్‌ఫుల్ డెకొరేషన్‌తో లిక్కర్ షాపు



షాపు వెనుకే అన్నీ సిద్ధం



చక్కటి సీటింగ్ తదితర వసతులు

ప్రజాశక్తి - నాయుడుపేట: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గవర్నమెంట్ షాపులుగా ఉన్న బ్రాందీ షాపులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ షాపులుగా మారాయి. బ్రాందీ షాపులకు లైసెన్సులు తీసుకుని ప్రతి షాపు లోనూ బార్లను నడిపిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు జేబులు నింపుకోవడానికి వాళ్లకి సహరిస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారని విమర్శలున్నాయి. గతంలో వైసీపీ గవర్నమెంట్‌లో ప్రభుత్వ మందు షాపుల్లో మద్యం సేవించేందుకు అనుమతి ఇచ్చేవారు కాదు. ఆ కారణంగా అప్పట్లో నాయుడు పేటలో బారు నడిచేది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. కానీ ఇప్పుడు ప్రతి మద్యం షాపులోను బార్ల తరహా వసుతులు ఏర్పాటవడంతో, నాయుడుపేటకి బార్‌కు అను మతి ఉన్నప్పటికీ బార్ తీసుకు నేందుకు ఎవరు ముందుకు రావడం లేదని ఎక్సైజ్ సీఐ అరుణ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మద్యం షాపుకు 65 లక్షలు ప్రభుత్వానికి షాపు యజమాని చెల్లించాల్సి ఉంది. అదే బార్ లైసెన్సు కోటిన్నర వరకు చెల్లించవలసి వస్తుంది. ఇలా ఎక్సైజ్ సీఐ అరుణ తన సొంత ఆదాయంపై మక్కువతో ప్రభుత్వాదానికి గండి కొడుతుందన్న అభియోగం ఉంది. అధికారులకు వచ్చే వేల సంపాదన కోసం ప్రభుత్వానికి లక్షల్లో నష్టం తీసుకొస్తున్నారు. లైసెన్సులు లేకుండా మద్యం షాపుల్లో బార్లు నడపడంతో అక్కడ మద్యం చెవించే మందు బాబులు ఎవరిష్టానుసారం వారు ప్రవర్తిస్తున్నారు. బార్లు నడిపించే యజమానులు ఇక్కడ జరుగుతున్న గొడవలకు మాకు ఎలాంటి సంబంధం లేదు తాగి ఎందుకు మేము స్థలం చూపిస్తా? ఇక్కడ ఏం జరిగినా ఏం చేసినా ఎవరిష్టం వారిది మాకు ఏమాత్రం సంబంధం లేదు అన్న ట్టుగా ప్రవర్తిస్తు ఏమాత్రం జాగ్రత్తలు తీసుకోకుండా ఇష్టానుసారం బార్లను నడిపిస్తూ ఉండడంతో అక్కడికి వచ్చి తాగుతున్న మందుబాబుల బీభత్సాలకు హద్దులు లేకుండా పోతున్నాయి. తాగి విచక్షణ లేకుండా ఒకరిని ఒకరు దూషించుకుంటూ ఆ మత్తులో గొడవలు పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పలుమార్లు ఈ విషయాలను ఎక్సైజ్ సీఐ అరుణ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఏమాత్రం స్పందించకపోవడం గమనార్హం. ఎక్సైజ్ అధికారుల సహకారం వైన్ షాపుల యజమానులకు పుష్కలంగా లభిస్తుండడంతో ఇక్కడ జరిగే గొడవలు బయటకు రానీయకుండా లోపలే అణచి వేస్తున్నారు. ఈ క్రమంలో మంగళ వారం సాయంత్రం సుమారు 8:30 గంటల సమయంలో ఎక్సైజ్ కార్యాలయం పక్కనే ఉన్న వైసీపీ నాయకులు కామిరెడ్డి.సత్యనారాయణరెడ్డి శ్రీ శ్రీనివాస బ్రాందీ షాపులో కొంత మంది యువకుల మధ్య జరిగిన గొడవలు ప్రాణాలు పోయే స్థితికి చేరుకున్నాయి.కొంతమంది యువకులు తప్ప తాగి అక్కడే మద్యం చేవిస్తున్న మరొక యువకునతో మాట మాట పెరిగి ఆ యువకుని తో అకార ణంగా గొడవపడి విపరీతంగా కొట్టినట్టు సమాచారం. ఇంత జరిగినప్పటికీ ఎక్సైజ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడం బ్రాందీ షాపులలో జరిగే గొడవలపై ఏ రోజు స్పందించకపోవడం విశేషం. ఇక్కడ బ్రాందీ షాపు నాదే నడుపుతున్న వారందరూ రాజకీయ నాయకులే కావడంతో వారిపై అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇది అలాగే కొనసాగితే నాయుడుపేట లోని బ్రాందీ షాపుల్లో కొన్ని ప్రాణాలు పోయే పరిస్థితిలు ఎదురవు తాయి. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ అరుణ దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరగా ఆమె దీనిపై స్పందించేందుకు నిరాకరిస్తూ దాటి వేసే ప్రయత్నం చేశారు. మళ్లీ ప్రశ్నిస్తే మద్యం షాపుల్లో ఏం జరుగుతుందో అన్నీ మాకు తెలుసు మేము ఎలాంటి చర్యలు తీసుకోలేము మీకు ఇష్టం వచ్చింది రాసుకోండి అన్నట్టుగా ప్రవర్తిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇకనైనా అధికారులు స్పందించి ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యానికి, బ్రాందీ షాప్ యజమానుల దౌర్జన్యాలకు అడ్డుకట్టు వేయాలని నాయుడుపేట ప్రజలు కోరుకుంటున్నారు.

ఎంసీఏ కోర్సు ఉత్తమ ఎంపిక



ప్రజాశక్తి - క్యాంపస్ : ఎంసీఏ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఐటి రంగాలకు సంబంధించిన కోర్సులను ఎంచుకోవడం ఉత్తమమని ఆర్సిఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ చౌదరి పేర్కొన్నారు. తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఆర్‌సిఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎంసీఏ విద్యార్థులకి గ్రాడ్యుయేషన్ డే, సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ పరిశ్రమ నిరంతర అభివృద్ధి జరుగుతోందని, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, వెబ్ అభివృద్ధి, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ భద్రత, డేటా సైన్స్, కృత్రిమ మేధస్సు సంబంధిత రంగాలలో నైపుణ్యం, అంకితభావం కలిగిన ఎంసీఏ విద్యార్థులకి మంచి డిమాండ్ ఉందన్నారు. డిక్సన్ టెక్నాలజీస్ లిమిటెడ్, మాజీ ఉపాధ్యక్షుడు కె.పి. రాజు మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రకాల నైపుణ్యాలను కాలానుగుణంగా నేర్చుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథి మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, ఏపీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.వెంకట ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఎంసీఏ కోర్సు సర్టిఫికెట్ తో పాటు వివిధ రకాల కొత్త కంప్యూటర్ భాషలు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాల్లో ఎంతో చలాకీగా వ్యవహరించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఆర్.శివప్రసాద్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు తమలక్ష్యాల కోసం నిరంతరం పరిశ్రమ చేయాలన్నారు. ఎంసీఏ కోర్సు సెమిస్టర్లలో ఉన్నత మార్కులతో రాణించిన విద్యార్థులకు బహుమతులు, నగదు ప్రోత్సాహం, మెడల్స్‌తో ముఖ్య అతిథి కె.పి.రాజు, గౌరవ అతిథి పి.వెంకట ప్రసాద్, కళాశాల డైరెక్టర్ వి.రవికుమార్ చౌదరి, కరస్పాండెంట్ ఆర్.శివప్రసాద్ వర్మ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి నిరీష, ఎంసీఏ విభాగాధిపతి పి. లలిత, అధ్యాపకులు సతీష్, మురళి, మాధురి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌటిల్య విద్యార్థులకు ఐఐఎం అడ్మిషన్లు



జి.వెంకట నితీష్ ఐ.ఐ.ఎం. - రాంచి | భవ్యశ్రీ నిషిత ఐ.ఐ.ఎం. - నాగపూర్ | కె.హారిక రాజు ఐ.ఐ.ఎం. - సిర్మౌర్ | కె.కార్తీక్ ఐ.ఐ.ఎం. - సిర్మౌర్ | జి.అభినయ్ సుప్రీత్ సింబయాసిస్, పూణె | పి.ఎస్.సుదర్శన్ సింబయాసిస్, పూణె

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి ఎమ్.ఆర్.పల్లి సర్కిల్ వద్ద వున్న "కౌటిల్య ఇన్స్టిట్యూషన్" సంస్థకి చెందిన నలుగురి విద్యార్థులకు ఈ వారంలో విడుదల చేసిన తుది ఫలితాలలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అత్యంత ప్రతిష్టాత్మక కాలేజీలు - ఐ.ఐ.ఎం.(ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్)లలో, మరొక 10 మందికి పైగా విద్యార్థులకు ఇండియా లోని టాప్ బిజినెస్ స్కూల్స్‌లలో ఎం.బి.ఏ అడ్మిషన్ సాధించారు. వీరంతా 2024 నవంబర్‌లో జరిగిన జాతీయ స్థాయి క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యార్థులు పోయిన సంవత్సరం కౌటిల్య లో క్యాట్ కోచింగ్ తీసుకొన్నారు. తర్వాత ఐ.ఐ.ఎంలు, బి.స్కూల్స్ నిర్వహించే పర్సనల్ ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్స్‌లో కౌటిల్యలో ఉచిత శిక్షణ పొందారు. ఈ అడ్మిషన్స్ పొందిన విద్యార్థులను ఈ సంస్థ డైరెక్టర్ శ్రీధర్, బోధనా సిబ్బంది- ఎన్.హరి, ఎన్.ఎస్. రెడ్డి, తదితరులు అభినందించారు. ఐ.ఐ.ఎం అడ్మిషన్స్ పొందిన తిరుపతి విద్యార్థులు వివరాలు జి.వెంకట నితీష్- ఐ.ఐ.ఎం- రాంచిలో ఎం.బి.ఏ. అడ్మిషన్ సాధించాడు. ఇతను ఎస్.వి.యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్‌లో బి.టెక్ పూర్తి చేసాడు. శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈ సంవత్సరం ఫుడ్ సైన్స్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థిని కే.హారిక రాజు -ఐ.ఐ.ఎం సిరమౌర్ లో అడ్మిషన్ సాధించింది. కరకంబాడిలోని ఎస్.వి.సి.ఈ ఇంజనీరింగ్ కాలేజీలో బి.టెక్ పూర్తి చేసిన భవ్యశ్రీ నిశిత, కే.కార్తిక్‌లు ఐ.ఐ.ఎం నాగపూర్, ఐ.ఐ.ఎం.సిర్మౌర్‌లో అడ్మిషన్స్ సాధించారు. అలానే, ప్రముఖ బిజినెస్ స్కూల్ సింబయాసిస్ ఇన్స్టిట్యూట్, పూణే లో ఇద్దరు విద్యార్థులు - జి.అభినయ్ సుప్రీత్ మరియు పి.ఎన్.సుదర్శన్ (ఎస్.వి.సి.ఈ -పూర్వ విద్యార్థి) అడ్మిషన్స్ సాధించారు. ఈ సందర్భంగా కౌటిల్య డైరెక్టరు శ్రీధర్ మాట్లడుతూ ముందున్నవాళ్లకు ముందే అవకాశాలు దొరుకుతాయి అనే సామెత ఈ క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) లో చాలా బాగా పని చేస్తుంది. అంటే విద్యార్థులు తమ డిగ్రీ / లేదా బి.టెక్ చదువుతున్నప్పుడే తమ ఖాళీ సమయాన్నిఈ ఐ.ఐ.ఎమ్‌లో ఎమ్బిఏ అడ్మిషన్ కోసం ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. సాధారణ డిగ్రీ- బి.ఏ, బి.కామ్, బి.ఎస్.సిలకు అమ్మాయిలకు ఐ.ఐ.ఎం లు అడ్మిషన్స్ విషయంలో చాలా ప్రాధాన్యత కూడా ఇస్తున్నాయి. క్యాట్‌లో స్కోర్‌తో పాటు, ఇంగ్లీష్ పై మరీ ముఖ్యంగా భావ వ్యక్తీకరణా నైపుణ్యాలపై పట్టు వున్న అభ్యర్థులకు ఐ.ఐ.ఎంలు ఆహ్వానం పలుకుతాయని తెలిపారు. ఈ కాలేజీలలో చదివిన వారికీ కోటి రూపాయల వరకు కూడా వార్షిక వేతనాలు లభించే అవకాశం కూడా వుందన్నారు. మన జిల్లా లోని ఎవరైనా ఈ క్యాట్ పరీక్ష, ఐ.ఐ.ఎం అడ్మిషన్స్‌కు సంభందించి ఉచిత గైడెన్స్ కావాల్సిన వాళ్ళు మా తిరుపతి కౌటిల్య సంస్థను 9698123456 కి ఫోన్ చేసి సంప్రదించవచ్చు.' అని అన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి : టిటిడి చైర్మన్



శ్రీశక్తి పీఠంలో టిటిడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ప్రజాశక్తి - రామచంద్రపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన ఆధ్యాత్మిక జీవితాన్ని గడపాలని టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రాయల చెరువు కట్టవద్ద నున్న శ్రీ శక్తి పీఠంలో, శ్రీ వారాహీ దేవి నవరాత్రుల ఉత్సవాలలో ఆయన పాల్గొన్నారు. కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి, శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానందభారతీ స్వామిలను టిటిడి చైర్మన్ మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం స్వీకరించి, టీటీడీ ప్రసాదాలను అందజేశారు.

ఆదివారం కూడా ఉపాధి హామీ పనులా?



ప్రజాశక్తి - సత్యవేడు: సెలవు దినమైన ఆదివారం రోజు కార్మిక చట్టాలకు విరుద్ధంగా ఉపాధి హామీ పనులు ఎలా చేపడుతారని సత్యవేడు సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ ప్రశ్నించారు. సత్యవేడు మండలం కన్నావరంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులను ఆయన కలిసి మాట్లాడారు. ఉపాధి హామీ పనులు ప్రారంభమై 15 సంవత్సరాలు కావస్తుండగా ఆదివారం పనిచేసిన దాఖలు లేదన్నారు. ఉపాధి పనులు సోమవారం నుండి శనివారం వరకు కార్మికులు పనిచేసేవారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం సెలవు దినమైన ఆదివారం నాడు ఉపాధి పనులను ఆపి, పని దినాలను పెంచి, రోజువారి కూలీ 600 చెల్లించేటట్లు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా జూలై 9వ తేదీన చేపట్టనున్న అఖిలభారత సమ్మెలో కార్మికులందరు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఘనంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: వైసీపీ మండల అధ్యక్షుడు సింహాల మోహన చినిగేపల గంగమ్మ తల్లి ఆలయంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి మంచి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, అక్రమకేసు నుంచి త్వరగా బయట పడాలని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని ప్రార్థించామన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం: తిరుపతి రూరల్ మండలం, దుర్గ సముద్రం సమీపంలోని అక్షయ క్షేత్రంలో ఆదివారం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనాధ పిల్లల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అభిమానులు కుప్పి రెడ్డి భాస్కర్ రెడ్డి, చెంగల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హథీరాం బావాజీ జయంతి వేడుకల్లో సాధువులు



జయంతి సందర్భంగా బోగ్ బండార కార్యక్రమంలో పాల్గొన్న సాధువులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీవారి పరమ భక్తులు శ్రీ స్వామి హథీరాం బావాజీ 596 జయంతి సందర్భంగా తిరుపతి గాంధీ రోడ్డు మార్గంలో ఉన్న మఠంలో ఆరు రాష్ట్రాలకు చెందిన 1200 మంది సాధువులు పాల్గొని ఘనంగా జయంతి వేడుకలు జరిపారు. హథీరాం బావాజీ సేవా సమితి నాయకులు హాజరై ఇకపై రానున్న రోజుల్లో భావాజీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే భోగ్ బండార కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రణాళిక బద్ధంగా ముందుకెళుతున్నామన్నారు. ఈ జయంతి వేడుకల్లో శివ నాయక్, మహారాష్ట్ర పౌరాదేవి సేవాలాల్ వంశస్థులు జితేంద్ర మహారాజ్, సర్దార్ సింగ్ మహారాజ్, మంజు మహారాజ్, రమేష్, గిరి, అశోక్ రాథోడ్, రవి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - సత్యవేడు: శ్రీవెంకటేశ్వర ఆసుపత్రి అధినేత రాజేంద్రన్ పర్యవేక్షణలో చెన్నై శంకర్ నేత్రాలయానికి సంబంధించిన రాము, అల్ ఫోన్స్ సూపర్వైజర్స్ బృందం రోగులకు ఆదివారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 165 మంది రోగులు పాల్గొనగా, 70 మందికి ఆపరేషన్ చేయడానికి వైద్యులు సిఫార్సు చేశారు. 70 మందిలో మొదటి 35 మందిని ఆదివారమే చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రికి తరలించారు. సోమవారం మరో 35 మందిని చెన్నైకు తరలించి ఆపరేషన్ చేయనున్నారు.

న్యూ మంగళం పంచాయతీ టీడీపీ కమిటీ ఎన్నిక



కమిటీ అధ్యక్షులు గోపాల్ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని న్యూ మంగళం గ్రామపంచాయతీ నూతన టిడిపి కమిటీని తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి ప్రకటించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశానుసారం ఈ కమిటీ ఎన్నిక జరిగిందన్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా మాతయ్య, అధ్యక్షులుగా వేమూరు గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మునయ్య యాదవ్, మహిళా అధ్యక్షురాలుగా రెడ్డమ్మ తదితరులతో కమిటీని నియమించారు.

మత్తును తరిమేద్దాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మానవాళి మనుగడకు పెనుముప్పుగా పరిణమిస్తున్న మత్తును సమాజం నుండి దూరంగా తరిమేద్దామని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు పిలుపునిచ్చారు. టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం 'డ్రగ్స్ వద్దు - జీవితం ముద్దు' అంటూ జయరాంరావు వీధి, పూసల వీధి కూడలిలో ప్రజల చేత మాదక ద్రవ్యాల నిరోధకంపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి, మిన్నల్ రవి, మునిరాజా యాదవ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై లైట్లు వెలిగించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులో 600 మీటర్ల పొడవైన ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం రాత్రి ఒక్క స్ట్రీట్ లైటూ వెలగలేదు. చీకట్లో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపల్ అధికారులను తక్షణం స్పందించి, ఇలాంటి పరిస్థితి మళ్లీ పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రైం న్యూస్

నాటు తుపాకి స్వాధీనం



ప్రజాశక్తి - నాగలాపురం: ఆదివారం మండలంలోని సురుటుపల్లి పంచాయతీ, కస్తూరినాయుడు కండ్రిగలో తెల్లవారు జామున కాటన్ సెర్చ్‌లో బాగంగా ఎస్ఐ సునీల్ తన సిబ్బందితో ప్రతి ఇంటిని తనిఖీ చేస్తుండగా లేట్ చెల్లప్ప నాయుడు కుమారుడు ఎన్.గోవిందయ్య (71) ఇంటిలో ఎస్బిఎంఎల్ కంట్రీ మేడ్ (నాటు తుపాకి), తుపాకికి సంబందించి నల్లమందులు స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ మాట్లాడుతూ ఇతను కెవిబి పురం మండలంలోని అంజూరు గ్రామం నుంచి ఇక్కడకి వలస వచ్చినట్లు, అంతే కాకుండా 20 సంవత్సరాల క్రితం శ్రీ కాళహస్తి ఫారెస్ట్ రేంజిలో వైల్డ్ లైఫ్ కేసు ఇతని మీద నమోదైనట్లు తెలిపారు. ఎవరైన అనుమానిత వ్యక్తులు కనిపిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట పాత ఈనాడు కార్యాలయం వెనుక వైన్ షాపు వద్ద ఆదివారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. తిరుపతి లీలామహల్ సర్కిల్ వద్ద ఓ అపార్ట్మెంట్లో కాపలాగా ఉంటున్న కృష్ణారెడ్డి (సుమారు 65 సంవత్సరాలు)ఆ వైన్ షాపులో వాచ్మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయాన్నే డ్యూటీ దిగిన అతను రోడ్డు పక్కన గాయాలతో మృతి చెంది ఉన్నాడని స్థానికులు తెలుపగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు వివరాలు తెలియాల్సి ఉంది.

నేరాల కట్టడికే కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గూడూరు రూరల్ పరిధిలోని టిడ్కో గృహ ల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ మాట్లాడుతూ అనుమానితులు కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశామని తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వై.జె.పి ఆధ్వర్యంలో తల్లి, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా కొండూరు ప్రభాకర్ రాజు, విజయమ్మలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.రావు, క్లబ్ సభ్యులు మురళి రాజు, గోపినాథ్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి దిక్సూచి సంస్కృత భాష

ప్రజాశక్తి - క్యాంపస్ : నేపాల్‌లో జరుగుతున్న 19వ విశ్వ సంస్కృత సమ్మేళనంలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. సంస్కృత భాషా వైభవాన్ని, సంస్కృత భాషలో ఉన్నటువంటి విజ్ఞానాన్ని, ఆధునిక తరానికి సంస్కృతం ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే విషయాలపైన సంస్కృత సదస్సు నేపాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణమూర్తి సంస్కృత భాష ఔన్నత్యం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ సంస్కృత భాషను, జ్ఞానాన్ని తెలుసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఘనంగా మహాన్ నోబిస్ జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, అనంత దత్త విభాగం ఇండియన్ సొసైటీ ఫర్ రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్పిఎస్) డేటా సైన్స్ సెంటర్ తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో భారత గణాంక శాస్త్ర పితామహుడు ఆచార్య ప్రశాంత్ చంద్ర మహల్ నోబిస్ 133వ జయంతి సందర్భంగా జూన్ 29వ 19వ జాతీయ గణాంక శాస్త్ర దినోత్సవాన్ని ఆదివారం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఐఐటీ తిరుపతి ప్రముఖ గణాంక శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్, బాలకృష్ణ, యూనియన్ బ్యాంక్, జోనల్ హెడ్ పత్రి శ్రీనివాస కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్‌ఫోలియోను ప్రారంభించిన లౌరిట్జ్

Lauritz Knudsen
Electrical & Automation

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: విద్యుత్, ఆటోమేషన్ రంగంలో అగ్రగామి అయిన లౌరిట్జ్ నుడ్సెన్ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్, దేశంలోని కీలకమైన పారిశ్రామిక సమూహాలు, వృద్ధి కారిడార్లకు శక్తినిచ్చే లక్ష్యంతో తన అతిపెద్ద ఉత్పత్తి పోర్ట్ఫోలియోను ఆవిష్కరించినట్లు సి ఓ ఓ నరేష్ కుమార్ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక చొరవలో భాగంగా, బ్రాండ్ దేశవ్యాప్తంగా 30 పారిశ్రామిక నగరాల్లో పర్యటిస్తోందని తెలిపారు. స్థానిక నాయకులు, వాటాదారులు, పర్యావరణ వ్యవస్థ భాగస్వాములతో కలిసి భారతదేశ తయారీ, మౌలిక సదుపాయాల కేంద్రాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడాన్ని వేగవంతం చేస్తుందన్నారు. తక్కువ వోల్టేజ్, పారిశ్రామిక ఆటోమేషన్, కొత్త శక్తి ప్రకృతి దృశ్యానికి పరిష్కారాలపై బలమైన దృష్టితో, లౌరిట్జ్ క్నుడ్సెన్ భారతదేశ పారిశ్రామిక వెన్నెముకలోకి లోతుగా చేరే సాంకేతికత ఆధారిత పరివర్తనను నడుపుతున్నామని తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ శ్రీమతి ఎన్.మౌర్య ఐఏఎస్ గారు తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని తెలిపారు.

వాహనాలపై అనధికారిక స్టిక్కర్లు తొలగింపు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా ప్రెస్, పోలీసు, టిటిడి స్టిక్కర్లు వేసుకున్న వాహనదారులపై ఆదివారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రెస్ స్టిక్కర్ వేసుకున్న 41 వాహనాలపై, పోలీసు స్టిక్కర్ వేసుకున్న 54 వాహనాలపై, టిటిడి ఉద్యోగులు పేరుతో స్టిక్కర్లు అనాధికారికంగా ఉన్న 31 వాహనాలపై స్టిక్కర్లను తొలగించారు. వారందరికి మొదటి తప్పుగా పరిగణలోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు. అనధికారికంగా ప్రెస్, పోలీస్, టిటిడి విధులతో సంబంధం లేనివారు వాహనాలపై స్టిక్కర్లను అతికించుకోవడం చట్టపరపరంగా నేరమని తెలిపారు. నిబంధనలు ఎవరు ఉల్లంఘించిన వారి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.